క్లుప్తంగా

శశిధర్ మెమోరియల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

ఉండ్రాజవరం: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలో వేలివెన్ను గ్రామంలో శశిధర్ మెమోరియల్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభం అయ్యాయి. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు లాంఛనంగా ఈ పోటీలను ప్రారంభించారు. నిడదవోలు నియోజకవర్గ స్థాయిలో శశి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 56 జట్లు పాల్గొంటున్నాయని పోటీల కన్వీనర్ బూరుగుపల్లి శ్రీనివాస్ తెలిపారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి ప్రసాద్

నల్లజర్ల: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన బోదేపల్లి శ్రీను తన తల్లి నాగమ్మ జ్ఞాపకార్థం ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 90 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జగన్నాథపురం గ్రామంలోని మదర్ థెరిసా విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి ప్రసాద్ చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దిపాటి మాట్లాడుతూ ఉన్న ఊరును, కన్నతల్లిని గుర్తుంచుకునే వారే గొప్పవారు కాగలుగుతారన్నారు. ఆ కోవకు చెందిన వ్యక్తే శ్రీను అన్నారు. పంచాయతీ సర్పంచ్ చెల్లారి రామ శ్రీనివాస్, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో పశు వైద్యశిబిరాలు



దారవరంలో పశు పోషకులకు పశు ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవిప్రసాద్

చాగల్లు: మండలంలో చాగల్లు, దారవరం, కలవలపల్లి గ్రామాల్లో బుధవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ ఆయా పంచాయతీల సర్పంచులు ఉన్నమట్ల మనశ్శాంతి, మద్దుకూరి రవిప్రసాద్, ఆకుల లక్ష్మి ఈ శిబిరాలను ప్రారంభించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అలాగే పాడి రైతులకు పశు ఆరోగ్య కార్డులను సర్పంచుల చేతులమీదుగా అందించారు. రైతులందరూ తమ పశువులకు టీకాలు వేయించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు యు. ముఖేష్, ఎం.రాజేష్, సిబ్బంది విజయలక్ష్మి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం వెళ్లి పింఛను అందజేత



అనంతలక్ష్మికి వృద్ధాప్య పింఛను అందిస్తున్న వలంటీర్లు సంధ్య, సత్యవేణి

నిడదవోలు: పట్టణంలోని ఏడో వార్డు, చర్చిపేటకు చెందిన నందివాడ అనంతలక్ష్మి గుండె వ్యాధితో బాధపడుతూ రాజమహేంద్రవరం సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్లు సంధ్య, సత్యవేణి తమ సొంత ఖర్చులతో బుధవారం ఆసుపత్రికి వెళ్లి అనంతలక్ష్మికి వృద్ధాప్యపు పింఛను రూ.3 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కౌన్సిలర్ ముంగండి మాణిక్యమాల వలంటీర్లను అభినందించారు.

16 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

నల్లజర్ల: ఎస్ఈబీ, దేవరపల్లి పోలీసులు బుధవారం నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామంలో సారా విక్రయిస్తున్న సుంకర కిరణ్‌కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ డి.సుధ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఆమె చెప్పారు. అలాగే గోపాలపురం మండలంలో ఎనిమిది మంది పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు.

సారా, మద్యం సీసాలతో మరొకరు..

గోపాలపురం: సారా, మద్యం విక్రయిస్తున్న మండలంలోని తొక్కిరెడ్డిగూడేనికి చెందిన మాన్యం సత్యనారాయణ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి ఇంట్లో లభించిన 40 లీటర్ల సారా, 20 మద్యం సీసాలను స్వాధీనం కున్నట్టు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటి విలువ రూ.30 వేలు ఉంటుందన్నారు. నిందితుడ్ని కొవ్వూరు కోర్టులో తరలించగా రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారు

- పింఛను మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచారు
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- లబ్ధిదారులకు పెంచిన, కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ



సమిశ్రగూడెంలో లబ్ధిదారులకు పెంచిన పెన్షన్ సొమ్ము అందజేస్తున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



ద్వారకా తిరుమలలో లబ్ధిదారుకు పెంచిన పింఛన్ సొమ్ము అందిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు రూరల్: సామాజిక పింఛను సొమ్ము పెంపు విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో నెలవారీ పింఛను మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి అందజేస్తున్నామన్నారు. మండలంలోని సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను బుధవారం పండగ వాతావరణంలో 190 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయంలో జన్మభూమి కమిటీలకు పెత్తనం ఇచ్చి అర్హులైన వారికి పెన్షన్లు నిలిపివేయించిన ఘనత చంద్రబాబుదని విమర్శించారు. తన భర్త చనిపోయిన 30 ఏళ్ల తర్వాత, ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వితంతు పింఛన్ మంజూరైందని తిమ్మరాజుపాలేనికి చెందిన కొమ్మిన కృష్ణవేణి ఎమ్మెల్యేకు చెప్పి మురిసిపోయింది. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, వైస్ ఎంపీపీలు కానుబోయిన ప్రభావతి, వడల రత్నకుమారి, సొసైటీ అధ్యక్షులు గజ్జరపు శ్రీరమేష్, యాళ్ల రామారావు, ఎంపీడీఓ పి.శామ్యూల్ వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలలో..

ద్వారకా తిరుమల: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచి విశ్వసనీయతను చాటారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పింఛన్ల పెంపు ఉత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ముందుగా పెరిగిన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో రూ.3 వేల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దిరెడ్డి రమ్య కుసుమ, తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీవో తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగతం



సామాజిక పింఛను మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.2,750 నుంచి రూ.మూడు వేలకు పెంచింది. పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం కాకినాడ విచ్చేశారు. ఆయనకు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. అవ్వాతాతల ఆనందోత్సాహాల మధ్య సందడిగా ఈ కార్యక్రమం జరిగింది.

సురక్ష.. ప్రజారోగ్యానికి సర్కారు రక్ష

- నిడదవోలు మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ
- నిడదవోలు, కొవ్వూరులలో జగనన్న సురక్ష వైద్య శిబిరాలు



నిడదవోలులో మందులు పంపిణీ చేస్తున్న ఛైర్మన్ ఆదినారాయణ, కమిషనర్ పద్మావతి



కొవ్వూరులో మందులు అందజేస్తున్న మునిసిపల్ ఛైర్ పర్సన్ బావన రత్నకుమారి

నిడదవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజా రోగ్యానికి సర్కారు ఇచ్చిన రక్ష అని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పలు ప్రాంతాల్లో కోలాహలంగా సాగుతున్నాయి. స్థానిక నెహ్రూ నగర్ సచివాలయంలో బుధవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. నెహ్రూనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని 403 మంది రోగులకు వైద్యాధికారి ఈ.తేజశ్రీ నేతృత్వంలోని ముగ్గురు వైద్యుల బృందం వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. పురుషులు 183 మందికి, మహిళలు 220 మందికి, విద్యార్థులు ముగ్గురికి, గర్భిణులు నలుగురికి వారికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే ఈ శిబిరంలో 14 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి ఈ.తేజశ్రీ చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. శిబిరంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీసాబేగం, గోపిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొవ్వూరు ఒకటో సచివాలయంలో 400 మందికి..

కొవ్వూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మునిసిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధి, శ్రీరామా కాలనీలో బుధవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తొలుత వైద్య సిబ్బంది, వలంటీర్లు సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తిస్తారన్నారు. అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్య, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్‌లు శిబిరాన్ని సందర్శించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి వివిధ రకాల వైద్య సేవలు అందించామని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి సుష్మ తెలిపారు. అవసరమైన వారికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. స్త్రీ వ్యాధుల వైద్య నిపుణురాలు సౌందర్య, డాక్టర్ మృదుల, పిల్లల వ్యాధి వైద్య నిపుణుడు స్వాగత్, జనరల్ వైద్య నిపుణురాలు సుష్మతో పాటు సాధారణ వైద్య సేవలు కూడా అందించారు. అలాగే 53 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 11 మందికి ఆపరేషన్లు అవసరమని ,37 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. కళ్లజోళ్లు ,కంటి ఆపరేషన్లు ప్రభుత్వం ద్వారా ఉచితంగా చేయిస్తామని డాక్టర్ సుష్మ తెలిపారు.

వెల్‌నెస్ సెంటర్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

నల్లజర్ల: గ్రామీణ స్థాయిలో ప్రజారోగ్య వ్యవస్థ పనితీరును నేరుగా పరిశీలించేందుకు వైద్య,ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం బుదవారం మండలంలోని ప్రకాశరావుపాలెం వెల్ నెస్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు జరిపింది. ప్రజలకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయనే విషయాన్ని ఈ బృందం నిశితంగా పరిశీలించింది. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలపై ఈ బృందంలోని సభ్యులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. పలువురు విద్యార్థులతో మాట్లాడారు. ఈ బృందంలో డీపీఎంఓ డాక్టరు అభిషేక్ రెడ్డి, జిల్లా గణాంకాధికారి జె.కుమారస్వామి, డీపీహెచ్ఎన్ఓ వసంతలక్ష్మి, డీపీఓ సంధ్యారాణి, డేటా మేనేజరు రామకృష్ణ ఈ టాస్క్‌ఫోర్స్ బృందంలో ఉన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావు, సీహెచ్ఓ ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ నర్స్ రాధా కుమారి తదితరులు ఈ బృందం వెంట ఉన్నారు.

క్రీడాకారులకు టీ షర్ట్‌ల అందజేత



తాళ్లపూడిలో టీ షర్ట్‌లను చూపుతున్న ఎంపీపీ, ఎంపీడీవో, వ్యాయామోపాధ్యాయులు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పెరవలి ఎంపీపీ కార్రెర్ల ప్రసాద్

తాళ్లపూడి: మండలస్థాయిలో నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అన్నారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు, వ్యాయామోపాధ్యాయులకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టోపీలు, టీషర్ట్‌లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలానికి, నియోజకవర్గానికి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని వ్యాయామోపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రమణ, వైఎస్సార్ సీపీ నాయకులు గూడా విజయరాజు, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలపై సన్నాహక సమావేశం

పెరవలి: ఈ నెల 10 నుంచి 23 తేదీ మధ్యలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించాలని ఎంపీపీ కార్రెర్ల ప్రసాద్ సూచించారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, పాఠశాలల వ్యాయామోపాధ్యాయులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ ఆ క్రీడా పోటీలను ఖండవల్లి, ముక్కామల, కాకరపర్రు ఉన్నత పాఠశాలల మైదానాల్లో జరుగుతాయన్నారు. క్రికెట్ ఖండవల్లిలోను, వాలీబాల్, షటిల్ కాకరపర్రులోను, ఖోఖో, కబడ్డీ పోటీలు ముక్కామల హైస్కూల్ మైదానంలోనూ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకటరమణ, ఎంఈఓ ఎస్వీ సూర్జాన్, పీడీ పల్లపురాజు, వేణు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



దుర్గమ్మను దర్శించుకుంటున్న జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీలేఖ

తాళ్లపూడి: అన్నదేవరపేట బీసీ కాలనీలో నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా జరిగింది. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారిని జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ తదితరులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన ఐజీ



మంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్

కొవ్వూరు: ఏలూరు రేంజ్ డీఐజీ నుంచి ఐజీగా పదోన్నతి పొందిన జీవీజీ అశోక్‌కుమార్ రాష్ట్ర హోం, విపత్తుల నివారణ శాఖ మంత్రి తానేటి వనితను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతిపై వెళుతున్న అశోక్‌కుమార్‌ను మంత్రి అభినందించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ కూడా మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నల్లజర్లలో జెడ్పీ హైస్కూల్ 1989-90 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

నల్లజర్ల: స్థానిక జెడ్పీ హైస్కూల్ 1989-90 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు దాదాపు 34 ఏళ్ల తర్వాత బుధవారం స్థానిక అల్లాడ రామయ్య కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. భద్రాచలం పేపరు బోర్డులో పనిచేస్తున్న తాళ్లూరి నారాయణ, విశాఖలో ఉంటున్న శేషుకుమారి, హైదరాబాదులో నివాసం ఉంటున్న సత్యసాయి, జి.పద్మలత, ఊర్ల గోవిందరావు తదితర 50 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒకరినొకరు పలకరించుకుంటూ, చిన్ననాటి స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులు గొట్టిపాటి శ్రీరామ్మూర్తి, శ్రీమతి దత్తులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. తమతో చదువుకుని అసువులు బాసిన ఐదుగురికి సమావేశం సంతాపం తెలిపింది. పాఠశాల అభివృద్ధికి తామంతా కృషి చేస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రకటించారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన పూర్వ విద్యార్థి మద్దిపాటి ప్రసాద్‌కు శాలువా కప్పి సత్కరించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి


తణుకు: మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన ముంగర శ్రీనివాస్ (36) భార్య పురుడు కోసం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం మండపాక గ్రామంలోని పుట్టింటికి వచ్చింది. దీంతో శ్రీనివాస్ బుధవారం భార్య, పిల్లలను చూసేందుకు మండపాక వచ్చాడు. సాయంత్రం స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై తిరిగి బయలుదేరాడు. గ్రామ శివార్లలోకి వచ్చేసరికి ట్రాక్టర్ వెనుక నుంచి వేగంగా వచ్చి ఇతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై శ్రీనివాస్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తణుకు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గోపాలపురం: తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటి నివారణకు ఆయా ప్రదేశాల్లో రేడియం స్టిక్కరింగ్ కలిగిన డ్రమ్ములను ఏర్పాటు చేసినట్టు దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు చెప్పారు. గోపాలపురం- కొయ్యలగూడెం జాతీయ రహదారిపై ఇటీవల ప్రమాదాలు సంభవించిన ప్రదేశాలను బుధవారం ఆయనపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు అతి వేగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ కూడా ఉన్నారు.

రాజేశ్వరి రామకృష్ణన్ సేవలు చిరస్మరణీయం

ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్



జైపూర్ షుగర్స్‌లో రాజేశ్వరి రామకృష్ణన్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వీవీ వినాయక్

చాగల్లు: జైపూర్ షుగర్స్‌తో సహా పలు పరిశ్రమలు ఏర్పాటు చేసి రాజేశ్వరి రామకృష్ణన్ ఈ ప్రాంత వాసుల సంక్షేమం కోసం కృషి చేశారని ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ అన్నారు. రాజేశ్వరి రామకృష్ణన్ సంతాప సభ బుధవారం చాగల్లులోని షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన వినాయక్ ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్వీఆర్‌కే పబ్లిక్ స్కూల్ ప్రెసిడెంట్ ఆళ్ల శివకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, మండల గౌరవాధ్యక్షుడు జుట్టా ఏడుకొండలు, కో-ఆపరేటివ్ స్టోర్స్ మేనేజర్ దండమూడి వీర వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.

గణనాథునికి పూజలు

తన స్వగ్రామమైన చాగల్లు విచ్చేసిన ప్రముఖ సినీ దర్శకుడు వీవీ వినాయక్ బుధవారం స్థానిక తెలగా సంఘం వినాయకుడి గుడిలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనను ఘనంగా సత్కరించింది. అనంతరం ఆయన స్థానిక వ్యాపారవేత్త పెంజర్ల గణేష్ కొత్తగా ప్రారంభించిన పప్పుల మిల్లును సందర్శించారు.

మహిళా లోకానికి ఆదర్శం సావిత్రీబాయి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- జయంతి సందర్భంగా ఘన నివాళి



నిడదవోలులో సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: దేశంలో స్త్రీ విద్యను ప్రోత్సహించిన భారతీయ తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే మహిళా లోకానికి ఆదర్శనీయురాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కొనియాడారు. సావిత్రీబాయి జయంతిని బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కార్యదర్శి గాజుల రంగారావు, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొవ్వూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సావిత్రీ బాయి పూలే జయంతిని జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జె.సునీత, ఇతర అధ్యాపకులు ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సునీతను సిబ్బంది ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఓబులునేని శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.